శ్రీ శివ పంచాక్షర నక్షత్రమాలా స్తోత్రమ్

శ్రీరస్తు

- భావార్థముతో -

శుభమస్తు



అవిఘ్నమస్తు

సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A.,
గౌతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్



Kiron Type Institute

శ్రీ శంకరాచార్య విరచిత

శివ పంచాక్షర నక్షత్రమాలా స్తోత్రమ్

(శ్రీ ఆదిశంకరాచార్యులవారు ఈ శివపంచాక్షర నక్షత్రమాలా స్తోత్రమందలి శ్లోకములన్నిటిలో నాలుగు పాదములయందు చివరన శివపంచాక్షర మంత్రము ఏర్పరచిరి. - దీనిని కంఠమునందు ధరించినవాడు శివసారూప్యము పొందును (ఈ స్తోత్రమందలి చివరి 28వ శ్లోకంలో ఈ విషయం తెలియజేయబడింది.)

01. శ్రీమదాత్మనే గుణైకసింధవే నమః శివాయ
ధామలేశధూతకోకబంధవే నమః శివాయ।
నామశేషితానమద్భవాంధవే నమః శివాయ
పామరేతరప్రధానబంధవే నమః శివాయ॥

శ్రీమంతమైన ఆత్మకలవాడు, సద్గుణసముద్రుడు, తన కాంతి లేశముచే సూర్యుని అవహేళనచేయువాడు, భక్తుల సంసార దుఃఖములను పోగొట్టువాడు, జ్ఞానులకు బంధువైనవాడు, అగు శివునకు నమస్కారము.

02. కాలభీతవిప్రబాలపాల తే నమః శివాయ
శూలభిన్నదుష్టదక్షఫాల తే నమః శివాయ।
మూలకారణాయ కాలకాల తే నమః శివాయ
పాలయాధునా దయాలవాల తే నమః శివాయ॥

యముని చూచి భయపడు మార్కండేయుని రక్షించిన వాడవు, దుష్టుడైన దక్షప్రజాపతి నుదుటిని శూలముచే భేదించినవాడవు, అన్నిటికీ మూలకారణమైనవాడవు, మృత్యువుకే మృత్యువైనవాడవు అగు ఓ శివా నీకు నమస్కారము.

03. ఇష్టవస్తుముఖ్యదానహేతవే నమః శివాయ
దుష్టదైత్యవంశధూమకేతవే నమః శివాయ।
సృష్టిరక్షణాయ ధర్మసేతవే నమః శివాయ
అష్టమూర్తియే వృషేంద్రకేతనే నమః శివాయ॥

భక్తులకు ఇష్టమైనవాటిని ముఖ్యముగా ప్రసాదించువాడు, దుష్టరాక్షస వంశములనే వెదురు బొంగులను తగులబెట్టు అగ్నిహోత్రుడు, సృష్టికి కారణమైనవాడు, ధర్మమునకు ఆనకట్ట వంటివాడు, భూమి – వాయువు – అగ్ని – జలము – ఆకాశము – సూర్యుడు – చంద్రుడు – జీవుడు అను ఎనిమిది రూపములున్నవాడు, జెండాపై వృషభ చిహ్నము ధరంచినవాడు అగు శివునకు నమస్కారము

04. ఆపదద్రిభేదటంకహస్త తే నమః శివాయ
పాపహారిదివ్యసింధుమస్త తే నమః శివాయ।
పాపహారిణే లసన్నమస్తతే నమః శివాయ
శాపదోషఖండనప్రశస్త తే నమః శివాయ॥

ఆపదలనే కొండలను పగులగొట్టు టంకాయుధమును చేతిలో పట్టుకొన్నవాడవు, పాపములను పోగొట్టే గంగానదిని తలపై మోయుచున్నవాడవు, పాపమును నశింపచేయు వాడవు, అందరిచే నమస్కరింపబడువాడవు, శాపదోషములను ఖండించుటలో శ్రేష్ఠుడవు అగు ఓ శివా! నీకు నమస్కారము.

05. వ్యోమకేశదివ్యభవ్యరూప తే నమః శివాయ
హేమమేదినీధరేంద్రచాప తే నమః శివాయ।
నామమాత్రదగ్ధసర్వపాప తే నమః శివాయ
కామనైకతానహృద్దురాప తే నమః శివాయ॥

ఆకాశమే కేశములుగా కలవాడవు, దివ్యమంగళస్వరూపుడవు, మేరుపర్వతమును విల్లుగా చేసుకొన్నవాడవు, నీ నామమును పలికినంతనే పాపములన్నిటినీ దహించి వేయువాడవు, కోరికలతో నిన్ను కొలుచువారికి దొరకని వాడవు అగు ఓశివా! నీకు నమస్కారము.

06. బ్రహ్మమస్తకావలీనిబద్ధ తే నమః శివాయ
జిహ్మగేంద్రకుండలప్రసిద్ధ తే నమః శివాయ।
బ్రహ్మణే ప్రణీతవేదపద్ధతే నమః శివాయ
జింహకాలదేహదత్తపద్ధతే నమః శివాయ॥

బ్రహ్మకపాలములను మాలగా ధరించినవాడవు, పాములను కుండలములుగా అలంకరించుకొన్నవాడవు, బ్రహ్మదేవునకు వేదములు బోధించినవాడవు, యముని శరీరమును కాలితో తన్నిన వాడవు అగు ఓ శివా! నీకు నమస్కారము.

07. కామనాశనాయ శుద్ధకర్మణే నమః శివాయ
సామగానజాయమానశర్మణే నమః శివాయ।
హేమకాన్తిచాకచక్యవర్మణే నమః శివాయ
సామజాసురాంగలబ్ధచర్మణే నమః శివాయ॥

మన్మథుని సంహరించినవాడు, పుణ్యకర్ముడు, సామగానము విని ఆనందించువాడు, బంగారు కాంతితో తళతళలాడుచున్న కవచమును ధరించినవాడు, ఏనుగు చర్మమును కట్టుకున్నవాడు అగు శివునకు నమస్కారము.

08. జన్మమృత్యుఘోరదుఃఖహారిణే నమః శివాయ
చిన్మయైకరూపదేహధారిణే నమః శివాయ।
మన్మనోరథావపూర్తికారిణే నమః శివాయ
సన్మనోగతాయ కామవైరిణే నమః శివాయ॥

జన్మ - మరణము మొదలగు ఘోర దుఃఖములను పోగొట్టువాడు,
చిన్మయస్వరూపుడు, నా కోరికలను తీర్చువాడు, సజ్జనుల మనస్సులందుండువాడు, మన్మథుని శత్రువు అగు శివునకు నమస్కారము.

09. యక్షరాజబంధవే దయాలవే నమః శివాయ
దక్షపాణిశోభికాంచనాలవే నమః శివాయ।
పక్షిరాజవాహహృచ్ఛయాలవే నమః శివాయ
అక్షిపాల వేదపూతతాలవే నమః శివాయ॥

కుబేరుని బంధువు, దయామయుడు, కుడిచేతిలో బంగారు కుండికను ధరించిన వాడు, విష్ణుమూర్తి హృదయములో నివసించువాడు, నుదిటి యందు మూడవకన్ను కలవాడు, వేదపఠనముచే పవిత్రమైన దవడలు కలవాడు అగు శివునకు నమస్కారము.

10. దక్షహస్తనిష్ఠజాతవేదసే నమః శివాయ
అక్షరాత్మనే నమద్బిడౌజసే నమః శివాయ।
దీక్షితప్రకాశితాత్మతేజసే నమః శివాయ
ఉక్షరాజవాహ తే సతాంగతే నమః శివాయ॥

కుడిచేతిలో అగ్ని కలవాడు, నిత్యమైన ఆత్మస్వరూపుడు, ఇంద్రునిచే నమస్కరింపబడువాడు, ధర్మదీక్ష కలవారిపై తన తేజస్సును ప్రసరింపజేయువాడు, వృషభవాహనుడు, మంచివారికి గతియైనవాడు అగు శివునకు నమస్కారము.

11. రాజతాచలేన్ద్రసానువాసినే నమః శివాయ
రాజమాననిత్యమందహాసినే నమః శివాయ।
రాజకోరకావతంసభాసినే నమః శివాయ
రాజరాజమిత్రతాప్రకాశినే నమః శివాయ॥

వెండికొండపై నివసించువాడు, ఎల్లప్పుడు చిరునవ్వుతో విరాజిల్లువాడు, తలపై చంద్రుని ధరించినవాడు, కుబేరుని మిత్రుడు అగు శివునకు నమస్కారము.

12. దీనమానవాళికామధేనవే నమః శివాయ
సూనబాణదాహకృత్కృశానవే నమః శివాయ।
స్వానురాగభక్తరత్నసానవే నమః శివాయ
దానవాంధకారచండభానవే నమః శివాయ॥

దీనులైన మానవుల పాలిటి కామధేనువు, పుష్పబాణుడైన మన్మథుని దహించినవాడు, తనపై అనురాగము కల భక్తుల పాలిటి బంగారు కొండయైనవాడు, రాక్షసులనే చీకటిని నాశనం చేయు సూర్యుడు అగు శివునకు నమస్కారము.

13. సర్వమంగళాకుచాగ్రశాయినే నమః శివాయ
సర్వదేవతాగణాతిశాయినే నమః శివాయ।
పూర్వదేవనాశసంవిధాయినే నమః శివాయ
సర్వమన్మనోజభంగదాయినే నమః శివాయ॥

పార్వతీదేవి వక్షస్థలంపై నిద్రించువాడు, దేవతలందరినీ మించినవాడు, రాక్షసులను నశింపచేయువాడు, అందరినీ వశపరచుకొను మన్మథుని సంహరించినవాడు అగు శివునకు నమస్కారము.

14. స్తోకభక్తితోపి భక్తపోషిణే నమః శివాయ
మాకరన్దసారవర్షిభాషిణే నమః శివాయ।
ఏకబిల్వదానతోపి తేషిణే నమః శివాయ
నైకజన్మపాపజాలశోషిణే నమః శివాయ॥

కొంచెము భక్తికలవారినైననూ పోషించువాడు, తేనెలొలుకు మధురమైన మాటలు కలవాడు, ఒక్క మారేడు దళముతో పూజించిననూ సంతోషించువాడు, అనేక జన్మల పాపములను పోగొట్టువాడు అగు శివునకు నమస్కారము.

15. సర్వజీవరక్షణైకశీలినే నమః శివాయ
పార్వతీప్రియాయభక్తపాలినే నమః శివాయ।
దుర్విదగ్ధదైత్యసైన్యదారిణే నమః శివాయ
శర్వరీశధారిణే కపాలినే నమః శివాయ॥

సర్వజీవులను రక్షించుటే స్వభావముగా కలవాడు, పార్వతీ ప్రియుడు, భక్తులను పాలించువాడు, గర్వించిన రాక్షస సైన్యములను సంహరించినవాడు, చంద్రుని ధరించిన వాడు, కపాలమును పట్టుకొన్నవాడు అగు శివునకు నమస్కారము.

16. పాహి మాముమామనోజ్ఞదేహ తే నమః శివాయ
దేహి మే వరం సితాద్రిగేహ తే నమః శివాయ।
మోహితర్షికామినీసమూహ తే నమః శివాయ
స్వేహితప్రసన్నకామదోహ తే నమః శివాయ॥

ఓ పార్వతీ ప్రియుడా! శివా! నీకు నమస్కారము. నన్ను కాపాడుము. వెండికొండపై నివసించువాడా! శివా! నాకు వరమివ్వుము. స్త్రీలను మోహింపచేసినవాడా! భక్తులకు ప్రసన్నుడవై కోరికలు తీర్చు నీకు నమస్కారము.

17. మంగళప్రదాయ గోతరంగ తే నమః శివాయ
గంగయా తరంగితోత్తమాంగ తే నమః శివాయ।
సంగరప్రవృత్తవైరిభంగ తే నమః శివాయ
అంగజారయే కరేకురంగ తే నమః శివాయ॥

వృషభవాహనుడవు, తలపై గంగను మోయుచున్నవాడవు, యుద్ధమునందు శత్రువులను సంహరించిన వాడవు, మన్మథుని శత్రువు అగు ఓ శివా! మంగళకరుడవైన నీకు నమస్కారము.

18. ఈహితక్షణప్రదాన హేతవే నమః శివాయ
ఆహితాగ్ని పాలకోక్షకేతవే నమః శివాయ।
దేహకాంతి ధూత రౌప్యధాతవే నమః శివాయ
గేహ దుఃఖపుంజ ధూమకేతవే నమః శివాయ॥

కోరిన కోర్కెలు తీర్చువాడు, యాగములు చేయువారిని రక్షించువాడు, వృషభధ్వజుడు, వెండికొండకంటే ఎక్కువగా ప్రకాశించు శరీరము కలవాడు, ఇంటికి సంబంధించిన దుఃఖములను తగులబెట్టువాడు అగు శివునకు నమస్కారము.

19. త్ర్యక్షదీ నసత్కృపాకటాక్ష తే నమః శివాయ
దక్షసప్తతన్తునాశదక్షతే నమః శివాయ।
ఋక్షరాజభానుపావకాక్ష తే నమః శివాయ
రక్ష మాం ప్రపన్నమాత్రరక్ష తే నమః శివాయ॥

మూడు కన్నుల వాడవు, దీనులను దయతో చూచువాడవు, దక్షుని యాగమును నాశనం చేసిన వాడవు, చంద్రుడు - సూర్యుడు - అగ్ని కన్నులుగా కలవాడవు, శరణు పొందినంతనే రక్షించువాడవు, అగు ఓ శివా! నీకు నమస్కారము. నన్ను కాపాడుము.

20. న్యంకుపాణయే శివంకరాయ తే నమః శివాయ
సంకటాబ్ధితీర్ణకింకరాయ తే నమః శివాయ।
కంకభీషితాభయంకరాయ తే నమః శివాయ
పంకజాననాయ శంకరాయ తే నమః శివాయ॥

జింకను చేతిలో ధరించినవాడు, శుభమును కల్గించువాడు, దుఃఖసముద్రము నుండి భక్తులను కడతేర్చువాడు, అజ్ఞానపీడితులను రక్షించువాడు, పద్మము వంటి ముఖము కలవాడు, మంగళకరుడు అగు శివునకు నమస్కారము.

21. కర్మపాశనాశ నీలకంఠ తే నమః శివాయ
శర్మదాయ నర్యభస్మకంఠ తే నమః శివాయ।
నిర్మమర్షిసేవితోపకంఠ తే నమః శివాయ
కుర్మహే నతీర్నమద్వికుంఠ తే నమః శివాయ॥

కర్మబంధములను తెంచువాడవు, నల్లని కంఠము కలవాడవు, సుఖప్రదుడవు, భస్మము పూసుకున్నవాడవు, మమకారము విడిచిన మహర్షుల సేవలందుకొనువాడవు, విష్ణుమూర్తిచే నమస్కరింపబడువాడవు అగు ఓ శివా! నీకు నమస్కారము.

22. విష్టపాధిపాయ నమ్రవిష్ణవే నమః శివాయ
శిష్టవిప్రహృద్గుహాచరిష్ణవే నమః శివాయ।
ఇష్టవస్తునిత్యతుష్టజిష్ణవే నమః శివాయ
కష్టనాశనాయ లోకజిష్ణవే నమః శివాయ॥

లోకములకు అధిపతి, విష్ణుమూర్తిచే నమస్కరింప బడువాడు, సదాచారముగలవారి హృదయములందు సంచరించువాడు, ఇంద్రుని కోరికలు తీర్చి సంతోషపెట్టువాడు, కష్టములు నాశనం చేయువాడు, లోకములను జయించినవాడు అగు శివునకు నమస్కారము.

23. అప్రమేయదివ్యసుప్రభావ తే నమః శివాయ
సత్ప్రపన్నరక్షణస్వభావ తే నమః శివాయ।

స్వప్రకాశనిస్తులానుభావ తే నమః శివాయ
విప్రడింభదర్శితార్ద్రభావ తే నమః శివాయ॥

తెలుసుకోలేని దివ్యప్రభావము కలవాడవు, భక్తులను రక్షించు స్వభావము కలవాడవు, స్వయంప్రకాశుడవు, అనంతమైన మహిమలు కలవాడవు, ఉపమన్యు అను బాలునిపై దయచూపించిన వాడవు అగు ఓ శివా! నీకు నమస్కారము.

24. సేవకాయ మే మృడ ప్రసీద తే నమః శివాయ
భావలభ్యతావకప్రసాద తే నమః శివాయ।
పావకాక్ష దేవపూజ్యపాద తే నమః శివాయ
తావ కాంఘ్రిభక్తదత్తమోద తే నమః శివాయ॥

ఓ శివా! సేవకుడైన నన్ను అనుగ్రహించుము. నీకు నమస్కారము. భక్తి ద్వారా నీ అనుగ్రహం లభించును. అగ్నియే మూడవ కన్నుగా కలవాడవు, దేవతలచే పూజింప బడువాడవు, నీ పాదభక్తులకు ఆనందమునిచ్చు వాడవు అగు నీకు నమస్కారము.

25. భుక్తిముక్తిదివ్యభోగదాయినే నమః శివాయ
శక్తికల్పితప్రపంచభాగినే నమః శివాయ।
భక్తసంకటాపహారయోగినే నమః శివాయ
యుక్తసన్మనఃసరోజయోగినే నమః శివాయ॥

భుక్తి – ముక్తి – దివ్య సుఖములు ఇచ్చువాడు, తన శక్తిచే సృష్టించిన ప్రపంచమునకు ఆధారమైనవాడు, భక్తుల కష్టములను తొలగించువాడు, యోగుల పరిశుద్ధ హృదయము లందు నివశించువాడు అగు శివునకు నమస్కారము.

26. అన్తకాంతకాయ పాపహారిణే నమః శివాయ
శాన్తమాయదన్తిచర్మధారిణే నమః శివాయ।
సన్తతాశ్రితవ్యథావిదారిణే నమః శివాయ
జన్తుజాతనిత్యసౌఖ్యకారిణే నమః శివాయ॥

యముని కూడ అంతమొందించువాడు, శాపమును తొలగించువాడు, మాయలు శాంతించిన గజాసురుని చర్మమును ధరించినవాడు, ఆశ్రితుల దుఃఖమును ఎల్లప్పుడు పోగొట్టువాడు, ప్రాణులకు నిత్యసుఖము నిచ్చువాడు అగు శివునకు నమస్కారము.

27. శూలినే నమో నమః కపాలినే నమః శివాయ
పాలినే విరించితుణ్డమాలినే నమః శివాయ।
లీలినే విశేషరుండమాలినే నమః శివాయ
శీలినే నమః ప్రపుణ్యశాలినే నమః శివాయ॥

శూలమును - కపాలమును - బ్రహ్మకపాలమాలను వీర భక్తుల తలలమాలను. ధరించినవాడు, రక్షకుడు, లీలలు చేయువాడు, మంచిస్వభావముకలవాడు, పుణ్యముతో విరాజిల్లువాడు అగు శివునకు నమస్కారము.


28. శివపంచాక్షరముద్రాం చతుష్పదోల్లాస పద్యమణిఘటితామ్।
నక్షత్రమాలికామిహ దధ దుపకంఠం నరో భవేత్సోమః॥

ఈ శివ పంచాక్షర నక్షత్ర మాలా స్తోత్రమందలి శ్లోకములన్నిటిలో నాలుగు పాదముల యందు చివరన శివ పంచాక్షర మంత్రము ఏర్పరచబడినది. దీనిని కంఠము నందు ధరించినవాడు శివసారూప్యము పొందును.

// ఓం నమః పార్వతీపతయే హర హర మహాదేవ! శంభో శంకర! //


- - - = - - -

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్



Kiron Type Institute

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్



(ఎక్కడైనా తప్పులు ఉంటే సహృదయంతో తెలియచేయవలసినదిగా మనవి.-944 044 9650, 994 994 1430)

Kiron Type Institute